శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## కావలిలో మైనర్ బాలికపై అత్యాచారం !

### కావలిలో తీవ్ర సంచలనం

**కావలి, జులై 28 ప్రభాతవార్త** సభ్య సమాజం తలదించుకునేలా 9 ఏళ్ల బాలికపై 53 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి చేసిన అత్యాచారం కావలిలో తీవ్ర సంచలనం సృష్టించింది. 4వ తరగతి చదువుతున్న ఈ బాలికపై జరిగిన అత్యాచారం కావలి నివ్వెరపోయింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి ఆదివారం టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కొండవీటి శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. కావలి పట్టణ వెంగళరావునగర్‌లో నివసిస్తున్న షరీఫ్ ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన సతీమణి పర్విన్ కావలి కందుకూరి గార్మెంట్స్‌లో పనిచేస్తున్నారు. ఈ దంపతులకు 9 సంవత్సరాల బాలిక, 11 సంవత్సరాల బాలుడు వున్నాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో 9 సంవత్సరాల బాలిక ఒక్కటే వుంది. ఇంటి పక్కన ఒకరి నివాసంలో బేల్దారి పనికి వచ్చిన 53 సంవత్సరాల వయసు కల్గిన మహబూబ్‌బాషా కళ్లు ఆ బాలికపై పడింది. శనివారం మధ్యాహ్నం ఈ బాలిక నివాసంలోకి మానవ మృగమైన మహబూబ్‌బాషా ఇంట్లోకి వెళ్లాడు. ఈ బాలిక చేతిలో వున్న సెల్‌ఫోన్‌ను లాక్కొని అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కాడు. ఆ బాలిక సెల్‌ఫోన్‌లోనే అర్ధనగ్న ఫోటోలు తీశాడు. అనంతరం అత్యాచారానికి పాల్పడ్డట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు. రాత్రి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాధితురాలు జరిగిన వివరాలు తెలియజేసింది. వెంటనే బాలికను తీసుకొని తుఫాన్‌నగర్‌లో నివసిస్తున్న మహబూబ్‌బాషా ఇంటికి వెళ్లారు. అత్యాచారం చేసిన నిందితుడిని బాలిక గుర్తించడంతో టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కావలి డిఎస్పీ వెంకట రమణ బాధితురాలు నివాసానికి వెళ్లి వివరాలు సేకరించారు. కావలిలో 9 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగిందన్న వార్త దావాలనంలా వ్యాపించడంతో తీవ్ర సంచలనం సృష్టించింది. ఏ నోట విన్నా ఈ మాటే వినిపిస్తోంది.

## పూర్వ విద్యార్థులతో కావలి ఎమ్మెల్యే కావ్య





**కావలి, జులై 28 ప్రభాతవార్త** కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో 1987 సంవత్సరం కావ్య కృష్ణారెడ్డితో (కావలి ఎమ్మెల్యే) బికాం చదివిన పూర్వ విద్యార్థులతో ఆదివారం ఆత్మీయ సమావేశ కలయిక జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఆయన సతీమణి లత దంపతులు పాల్గొన్నారు. కళాశాలలో చదువుకునే రోజులలో ఆ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కావలి జవహర్ భారతి కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి అక్కడే విద్యార్థులకు పాఠాలు చెప్పే అధ్యాపకుడుగా కూడా కొంతకాలం పనిచేశానన్నారు. వ్యాపారంలోకి అడుగుపెట్టాలన్న ఉద్దేశంతో అధ్యాపక వృత్తిని వదిలేశానన్నారు. ఈ రోజు ఒక శాసనసభ్యుడుగా నేను చదివిన కళాశాలలో ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెళ్లడం జరిగిందన్నారు. ఇదే రోజు నాతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులను కలుసుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. డబ్బులు సంపాదించుకోవడం కోసం రాజకీయాల్లోకి రాలేదన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. మనం ఎంత ఎదిగినా మన చిన్ననాటి స్నేహితులను మరవకూడదన్నారు. ఈ కార్యక్రమం హనుమంతరావు, మధు, వేమా రమేష్, చక్కా సూరి, నబీసాహెబ్, అనిల్, అలీం, తదితర పర్యవేక్షణలో జరిగింది.

## రూ. 10 లక్షలతో పైపులైన్



**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్, శ్రీహరి నగర్‌లో రూ. 10 లక్షల నిధులతో మంచినీటి పైప్ లైన్ పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జెడ్ శివప్రసాద్ మారం జ్యోతి నూకరాజు మదనకుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో పూర్తిగా గాడితప్పిన ఆంధ్రరాష్ట్రాన్ని అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గాడిన పెట్టేందుకు కృషి చేస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలో ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల్లో ఎవరికి నచ్చిన పార్టీకి వారు ఎన్నికలు చేసుకోవచ్చని, అనంతరం రాజకీయాలకు అతీతంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని రూరల్ నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హితవు పలికారు.

## మనుబాకర్‌కి అభినందనలు తెలిపిన నారాయణ


**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త - వైద్యం** పారిస్ ఒలింపిక్స్‌లో మన దేశానికి తొలి పతకం అందించిన మనుబాకర్‌కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పట్టణాభివృద్ధి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఒక మహిళ భారతదేశాన్ని పతకాల పట్టికలో చేర్చడం గొప్ప విషయమన్నారు. షూటింగ్‌లో తొలి కాంస్య పతకం అందించి మనుబాకర్ దేశానికి గర్వకారణంగా నిలిచారన్నారు.

## అంకమ్మతిరునాళ్లలో ఎమ్మెల్యే దంపతులు



**వలేటివారిపాలెం జులై 28, ప్రభాతవార్త** కందుకూరు మండలంలోని మహదేవ పురం, వలేటివారిపాలెం మండలం లోని శాఖవరం గ్రామాల్లో ని ర్వహిస్తున్న గ్రామదేవతశ్రీ అంకమ్మతల్లి తిరునాళ్ల కార్యక్ర మంలో ఆదివారం స్థానిక ఎమ్మె ల్యే ఇంటూరి నాగేశ్వర రావు సౌజన్య దంపతులు కుమారులు అవినాష్, సందీప్‌లు పాల్గొన్నారు. ఆయా గ్రామాలలోని బంధు మిత్రులు ఎమ్మెల్యే దంపతులను సాదరంగా ఆహ్వానించారు. ఘనంగా సత్కరించారు. దేవాలయాల్లో అంకమ్మతల్లి విగ్రహాలకు ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నేతలు పొడపాటి నరసింహం, వడ్లమూడి సురేష్, దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, ముచ్చు ఓంకారం, సోమినేని రవీంద్ర, మహదేవపురం మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోతుకోండ అంకాళపరమేశ్వరీ దర్శనానికి పోటేత్తిన భక్తులు



**తూమాయిరోడ్డు(రాపూరు), జులై 28ప్రభాతవార్త** మండలంలోని తూ మాయి రోడ్డు సమీపంలోని వున్న వేపినాపి గ్రామ దేవత శ్రీ అంకాళ పరమేశ్వరీ తల్లిదర్శనానికి ఆది వారం భక్తులు పెద్ద ఎత్తున వచ్చా రు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చక స్వాములు ప్రత్యేకంగాఅభిషేకాలు, పూజలు, పూలాంగి సేవ నిర్వహిం చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికిచేరుకోని అమ్మవారిని దర్శించు కోని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆందజేశారు.

## సదరన్ ఛానెల్ కాలువపై బ్రిడ్జి నిర్మాణం

### అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న రైతులు

### - నిర్మాణం చేపడతామంటున్న నేషనల్ హైవే అధికారులు





**కోవూరు జులై 28 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని జమ్మిపాలెం వెళ్లే దారిలో హైవే నిర్మాణంలో భాగంగా సదరన్ ఛానెల్ కాలువపై ఇంజనీరింగ్ అధికారులు నిర్మిస్తున్న కల్వర్టుపై ఆదివారం ఆ కాలువ పరిధిలోని రైతులు అధికారుల దగ్గరకు వచ్చి ఈ నిర్మాణ పనుల వలన రైతులకు ఉపయోగం లేదని, వెంటనే కల్వర్టు నిర్మాణ పనులు ఆపివేయాలని రైతులు నేషనల్ హైవే అధికారులకు విన్నవించారు. అయితే నేషనల్ హైవే డీఈ అనిల్ కుమార్‌రెడ్డి మాత్రం తమకు సాంకేతిక పరంగా ఇచ్చిన ప్లాన్ ప్రకారమే కల్వర్టు నిర్మిస్తున్నామని, పాత వాటిని కూల్చే అధికారం మాకు లేదని ఈ సందర్భంగా ఆయన రైతులకు వివరించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఈ కల్వర్టు వలన రైతులకు నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఈ సదరన్ ఛానెల్ కాలువకు దగ్గరగా ఉండే గ్రామాలు ముంపుకు గురయ్యే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఈ కల్వర్టు నిర్మాణ పనులను వెంటనే ఆపివేయాలని రైతులు నేషనల్ హైవే అధికారులతో వాదోపవాదాలు వేసుకున్నారు. అట్లు కాక నేషనల్ హైవే అధికారులు కల్వర్టు నిర్మిస్తామంటే అవసరమైతే ఈ విషయమై కోర్టుకు కూడా వెళ్తామని, ఈ విషయంలో తగ్గేదేలేదని రైతులు లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, దారపనేని శ్రీనివాసులు నాయుడు, జమ్మిపాలెం వెంకయ్య, విన్న కోట రాధాకృష్ణ, మహేష్‌రెడ్డి, తదితరులు నేషనల్ హైవే అధికారులతో పెద్దఎత్తున వాదోపవాదాలు వేసుకున్నారు. ఒకవైపు ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్నా.. నేషనల్ హైవే అధికారులు మాత్రం తమ ఇష్టానుసారంగా తమకు వచ్చిన ప్లాన్ ప్రకారం చేస్తామని చెప్పడం మంచిది కాదని రైతులు పేర్కొన్నారు. వెంటనే వారు చేపడుతున్న నిర్మాణ పనులు ఆపివేయకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కాలువపై కల్వర్టు నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ అనుమతి ఉందని నేషనల్ హైవే డీఈ చెప్పగా.. ఈ సమయంలో అక్కడకు వచ్చిన ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు అసలు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురాలేదని చెప్పారు. దీంతో రైతులు నేషనల్ హైవే డీఈతో గట్టిగా వాదులు వేసుకుని ప్రస్తుతానికి ఈ నిర్మాణపనులు ఆపివేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సదరన్ ఛానెల్ పరిధిలోని రైతులు, నేతలు , తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక




**నెల్లూరు, జులై28 ప్రభాతవార్త-విద్య** ఆదివారం నగరంలోని సా ్దనిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ పోటీల్లో అండర్ 11,13,15, 17,19 విభాగాల్లో మెన్, ఉమెన్‌ల కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్, విభాగాల్లో జరుగుతాయన్నారు. ఇందులో విజేతలైన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీల్లో పల్గొనేందుకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు తప్పని సరిగా వయస్సు ధృవీకరణ పత్రాలను అసోసియేషన్‌లో సమర్పించి ధృవీకరించుకోవాలని, అలాగే క్రీడాకారులు బాయ్ గుర్తింపు కలిగిన పోటీల్లో మాత్రమ పాల్గొనాలని, బాయ్‌గుర్తింపు లేని పోటీల్లో పాల్గొని క్రీడాకారులు వారి డబ్బు, సమయాన్ని వృదా చేసుకోవద్దని సూచించారు. అక్టోబర్‌లో నగరంలో అండర్11 బాల బాలికల రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రోత్సహించేందుకు సింహపురిస్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి ఆర్‌కే. యతిరాజ్, అసోసియషన్ నిర్వాహకులు దూడల సుధాకర్, శ్రీకాంత్, మద్దిపాటి ప్రసాద్‌రావు, రామ్మోహన్‌రావు, వరప్రసాద్, క్రీడాప్రాధికార సంస్థ అధికారులు విజయ్‌కుమార్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ నరసాలమ్మ తల్లికి పొంగళ్ళు



**సంగం జులై 28 ప్రభాతవార్త** సంగం మండలం చెన్నవరపాడు గ్రామంలో పొలాల్లో వెలసియున్న శ్రీశ్రీశ్రీ నరసాలమ్మ తల్లికి వైభవంగా పొంగళ్ళు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని అత్యంత సుందరంగా పరమళ పుష్పలాతో అలంకరించారు. పెద్దఎత్తున చుట్టుపక్కల గ్రామాల నుండి బంధువులు, ఆడపడుచులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి పొంగళ్ల పొంగించారు. పొంగళ్ళు పొంగించిన అనంతరం తీర్ధ ప్రసాదాలు అందజేశారు.



## దగదర్తిలో ఘనంగా బోనాల పండుగ



**దగదర్తి, జులై 28 ప్రభాతవార్త** దగదర్తి గ్రామంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. దగదర్తి గ్రామం నుండి శివాలయం వరకు వేషదారణలతో ఊరేగింపు జరిగింది. మహిళలు వందల సంఖ్యలో పాల్గొన్నారు. తల మీద కుండలు పెట్టుకుని గ్రామం అంతా ఊరేగారు. ఈ ఊరేగింపు శివాలయం చేరుకుంది. దేవాలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## తల్లిదండ్రుల పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయం



**కావలి, జులై 28 ప్రభాతవార్త** రాజకీయ పార్టీల నేతలు, సినిమా స్టార్స్ పేరు మీద కార్యక్రమాలు నిర్వహించే ఈ రోజుల్లో జన్మనిచ్చిన తల్లిదండ్రుల పేరు మీద సేవా కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) తెలిపారు. పులివర్తి రాఘవయ్యనాయుడు, వెంకట సుబ్బమ్మ మెమో రియల్ కావలి పట్టణ టెన్నీస్ టోర్నమెంట్ కా వలి జవహర్ భారతి కళాశాలలోని డిఆర్ గ్రౌండ్స్ లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమ నిర్వా హకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. డాక్టర్ డిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం సరదాగా కాసేపు టన్నీస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుడ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడాకారుల్లో వత్తిడి జయించే శక్తి వుంటుందన్నారు. జవహర్ భారతి కళాశాలలో విద్యనభ్యసించి ఇదే కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేసిన రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా రావడం చాలా ఆనందంగా వుందన్నారు. ప్రతి ఒక్కరికి విద్యను అందించాలనే సదుద్దేశంతో డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి విశ్వోదయ విద్యాసంస్థల్ని స్థాపించారన్నారు. ఎంతోమంది మేధావులను సమాజానికి అందించిన విద్యాదాత డాక్టర్ డిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ భారతి కళాశాల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పులివర్తి భాస్కర్, కమిటీ సభ్యులు రామకృష్ణ, వంశీమోహన్, డాక్టర్ పి.ప్రసాద్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎయంసి చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి లీగల్ సెల్ కావలి నియోజకవర్గ అధ్యక్షుడు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, మంచాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన



**బిట్రగుంట, జులై 28 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలులోని చెంచులక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలో గత వారం రోజుల నుండి వేళాపాళా లేకుండా కరెంటు కోతలు విధించడం వల్ల తాము సాగు చేస్తున్న వేరుశనగ పంట నీరు లేక ఎండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గృహ వినియోగదారులు కూడా కోతల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వేళాపాళా కోతలు విధించకుండా విద్యుత్ సరఫరా నిరంతరంగా వుండేటట్లు చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో చెంచులక్ష్మీపురం, అక్కరాజువారికండ్రిక గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రంలో ఆహార పొట్లాలు పంపిణీ




**బిట్రగుంట, జులై 28 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు ఆదరణ కేంద్రంలో ఆదివారం విశ్వనాధరావుపేట గ్రామానికి చెందిన వేణు, ప్రీతిల మనవరాలు ప్రియ పుట్టిన రోజు సందర్భంగా అనాధలకు ఆహారపు పొట్లాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బియంఆర్ యువసేన అధ్యక్షుడు సమీవుల్లా మాట్లాడుతూ ఆదరణ కేంద్రంలో పుట్టిన రోజు వేడుకలు అనాధల మధ్య జరుపుకోవడం పట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదరణ కేంద్ర నిర్వాహకులు సింహాద్రిరావు దంపతులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



బిట్రగుంట, జులై 28 ప్రభాతవార్త బోగోలు మండలం ముంగమూరు, జడగోగుల, జువ్వలదిన్నె, వడ్డిపాళెం గ్రామాలలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆచార్య ప్రభోదానంద యోగీశ్వర్ల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేసి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డి.సురమౌళి, సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీసిన స్మిత సబర్వాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



**కావలి రూరల్, జులై 28 ప్రభాతవార్త** తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఐఎస్ హోదాలో వున్న అధికారిణి స్మిత సబర్వాల్ దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీసే విధంగా దివ్యాంగులకు సామర్థ్యం లేదని అనడం సిగ్గుచేటు అని తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు, కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు మండవ వెంకట్రావు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో కీలక ఐఎస్ అధికారిణిగా వ్యవహరిస్తున్న స్మిత సబర్వాల్ దివ్యాంగుల మనోభావాలు దెబ్బతినే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఐఎస్ హోదాలో వుండే స్మిత సబర్వాల్ దివ్యాంగులను అండగా వుండాల్సింది పోయి వారికి సామర్థ్యం లేదని అనడం ఎంతవరకు సమంజసమని తెలిపారు. స్మిత సబర్వాల్‌పై తెలంగాణా, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ నేతలు శైలేష్, గోపి, శ్రీను, సి.హెచ్.వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి రామయ్య, యం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్‌షాపు నిర్వాహకురాలపై కేసు నమోదు

చేజర్ల జులై 28 ప్రభాతవార్త చేజర్ల మండలం తూర్పు కంభంపాడు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న అక్రమ మద్యం వ్యాపారి పంచేటి కృష్ణవేణిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.గత కొంతకాలంగా పోలీసులు,సెబ్ అధికారుల కళ్ళు కప్పి కృష్ణవేణి అక్రమ మద్యం వ్యాపారం గ్రామంలో యదేచ్ఛగా కొనసాగిస్తుంది.గతంలో పోలీసులు సెబ్ అధికారులు పలుమార్లు ఆమెను హెచ్చరించివున్నారు.అయినప్పటికి అధికారుల హెచ్చరికలను బేఖతరు చేస్తు ఆమె అక్రమ మద్యం వ్యాపారం కొనసాగిస్తుంది.అధికార ధరలు అమె సొమ్ము చేసుకుంటుంది.చేజర్ల బస్టాండ్ సమీపంలో తూర్పు కంభంపాడు గ్రామానికి చెందిన నరసయ్య వద్ద 20 మద్యం బాటిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీసులు అతని నుండి వివరాలు రాబట్టారు. కృష్ణవేణి బెల్ట్‌షాపులు నిర్వహిస్తు తన ద్వారా మద్యం బాటిల్స్ రవాణా చేయించుకునేదని చెప్పడంతో వారిరువురుపైన చేజర్ల పోలీసులు కేసు నమోదు చేసి

# ఇళ్ల పట్టాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

ఉదయగిరి,జులై 28,ప్రభాతవార్త: ఉదయగిరి మండలం దాసరపల్లి గ్రామంలో గల హైవే రోడ్డుకు పక్కన ఉన్న ఇళ్ల స్థలాలను తాసిల్దార్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామని వీఆర్వో వెంకట్ తెలిపారు. దాసరపల్లి గ్రామంలో ఇళ్ల పట్టాల విషయమై ఒక సామాజిక వర్గానికి చెం దిన కొంతమందికి అభ్యంతరాలు ఉండడంతో వారు ఉదయగిరి తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో భాగంగా అసలైన లబ్ధిదారులను అర్హత కలిగిన వారిని విచారించి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని రెవెన్యూ శాఖ సిబ్బంది తెలిపారు.సర్వేయర్‌తో కలిసి దాసరపల్లి సర్పంచ్ , గ్రామస్తుల సమక్షంలో విచారణ జరిపినట్లు ఆయన తెలిపారు.



# తెగచర్లలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ మనకీ బాత్

తెగచర్ల(రాపూరు),జూలై28ప్రభాతవార్త మండలంలోని తెగచర్ల గ్రామంలో ఆదివారం దేశ ప్రధాని నరేంద్రమోడీ మనకీ బాత్ 112వ ఫ్రోగ్రాంలోవెంకటగిరి నియోజకవర్గం బిజేపి ఇన్‌చార్జ్ యస్.యస్.ఆర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీనాయకులు కార్యకర్తలతో కలసి పియం మనకీ బాత్ 122వ సందేశాన్ని టీవీలలో విక్షించారు. అనంతరం ప్రధానమంత్రిమనకీ బాత్ కార్యక్రమాన్ని గూర్తి పార్టీ నాయకులకు,కార్యకర్తలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండలబిజేపి ఆధ్యక్షుడు దూడల పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు,కార్యకర్తలు వున్నారు.



# వెంకటాచలంలో పేదలకు దుప్పట్లు పంపిణీ

**వెంకటాచలం,జూలై28ప్రభాతవార్త** వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో వున్న ఒక చర్చిలో ఆదివారం నైనా పౌండేషన్ ద్వారాపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నైనా పౌండేషన్ ఆధ్యక్షురాలు ఎస్‌సి సుహాసిని మాట్లాడుతూ కరోనా సమయంలోకూడా మండలంలో అనేక గ్రామాలలో వంటసామగ్రి,నిత్యవసర సరుకులు,దుప్పట్లు,బట్టలు వంటివి పేదలకు పంపిణీచేయడం జరిగిందన్నారు. ఇప్పటిప తన పౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కండే వినయ్ కుమార్,హెభీప సంస్థ అధినేత దయాసాగర్,మెడికో సైమన్ సాహీత్ తదితరులున్నారు.




# కాలువ నిండా తుంగ పారేదెలా గంగ



**బుచ్చి జులై 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలో వందల ఎకరాలకు డ్రైన్‌గా ఉపయోగపడే చెల్లాయపాళెం డ్రైన్ పూర్తి స్థాయిలో వ్యూడిపోయింది.గుర్రపుడెక్క,తుంగతో పూడిపోవడంతో నీళ్ళు వెల్లేందుకు వీలు లేని విధంగా తయారు అయింది. ఈడ్రైన్ రెండు మండలాలలో ప్రవహించి బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కోవూరు కాలువ లోకలుస్తుంది. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి చెల్లాయపాళెం డ్రైన్ పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు.అలాగే మండలంలోని పలు డ్రైన్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. పాలకులు,అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

# గిరిజనులకు ఆధార్ కార్డులు అందించేలా చర్యలు

కోవూరు జూలై 28 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామ పంచా యతీలకు సంబంధించి 375 మంది గిరిజనులకు నేటికీ ఆధార్ కార్డులు లేవని, దీనికి సంబంధించిన సమాచారం జిల్లా కలెక్టర్ దగ్గరనుంచి వచ్చిందని ఎంపీడీవో శ్రీరామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గిరిజనులు ఆధార్ కార్డు లేని కారణంగా ఆశించిన మేర ప్రభుత్వ పథకాలు పొందలేకున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల వారీగా ఏయే గ్రామాల్లో ఈ గిరిజనులు ఉన్నారో సంబంధిత పంచాయతీ కార్యదర్శి ద్వారా జననాలకు సంబంధించి నాన్ అవైల్‌బులిటీ సర్టిఫికేట్‌ను తెప్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా వచ్చిన ఈ సర్టిఫికేట్లను రెవెన్యూ శాఖ ద్వారా పరిశీలించి , ఆర్డీవోకు పంపి వీరందరికీ డేటాఫ్ బర్త్ సర్టిఫికేట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.



# సంయుక్త సేవా సంస్థ ద్వారా పలు ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమం

కావలి రూరల్, జులై 28 ప్రభాతవార్త కావలి పట్టణానికి చెందిన స్వర్గీయ మొగిలిశెట్టి మురళి విహార్ జయంతి సందర్భంగా వారి తల్లి సరస్వతి స్థానిక తుఫాన్‌నగర్‌లోని సంయుక్త సేవా సం స్థ కార్యాలయంలో చదువుకుంటున్న వి ద్యార్థులకు చికెన్ బిర్యానిని అందజే శా రు. అలాగే స్వర్గీయ గోలే చంద్రశేఖర్ 16వ వర్ధంతి సందర్భంగా కావలి పట్ట ణ నివాసులు వృత్తి రీత్యా విదేశాలలో వుంటున్న వారి అక్క, బావ వాకాటి శ్రీదేవి, మహేంద్రలు బుడమగుంట గిరిజన కాలనీలోని వంద మంది పేదలక అన్నదానం నిర్వహించారు. కావలి పట్టణంలోని అడ్వకేట్ మంగళగిరిబాబు జన్మదినం సందర్భంగా తుఫాన్‌నగర్, జంగాల కాలనీలోని నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర మాట్లాడుతూ మంగళగిరిబాబు జన్మదినం, స్వర్గీయ మొగిలిశెట్టి మురళి విహార్ జయంతి,స్వర్గీయ గోలే చంద్రశేఖర్ 16వ వర్ధంతి సందర్భంగా కావలి పట్టణంలోని పలు ప్రాంతాలలో నిరుపేదలకు అన్నదానం చేయడం చాలా సంతోషంగా వుందన్నారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# జనవిజ్ఞానవేదిక మండల సమావేశం



వరికుంటపాడు,జులై28,ప్రభాతవార్తఃవరికుంటపాడు మండల జనవిజ్ఞానవేదిక సమావేశం ఆదివారం రాష్ట్ర వర్కింగ్ కమిటి ప్రసిడెంటుకుమ్మిత శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసమావేశంలో 5వజాతీయ మహాసభ బెంగుళూరులో జరిగిన సమావేశంపై రివ్యూనిర్వహించారు.అలాగే భవిష్యత్ ప్రణాళికలో భాగంగ ఆగష్టు 20వతేది వరికుంటపాడునందు రక్తదాన శిభిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ కార్యక్రమంలో జెవివి సీనియర్ భాద్యులు పిడుగు చెన్నకేశవులు,మేడసాని సుబ్బారావు,డివి రమణ,వైవి సుబ్బయ్య,పిఎం చలం ఎన్ రమణయ్య,తదితరులు పాల్గొన్నారు.

## రిలయన్స్‌లో నాటు బాంబులు పేలి రెండు గేదెలు మృతి





**ముత్తుకూరు, జులై 28, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పంచాయితీలోని రిలయన్స్ భూముల్లో మేతకు వెళ్లిన రెండు గేదెలు నాటు బాంబులు పేలి మృత్యువాత పడ్డాయని, గేదెలు బాధితుడు పోలిశెట్టి పరంధామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుచేసి రెండు గేదెలు కొంటే ఆ రెండు గేదెలు గుర్తు తెలియని వ్యక్తులు రిలయన్స్‌లో పం దులు పట్టుకునే దానికి నాటు బాంబులు ఏర్పాటు చేశారని మూగజీవాలు తెలియక మేత వేయడానికి వెళ్లడంతో ఆ బాంబులు పేలడంతో రెండు మృత్యువాత పడ్డాయని సుమారుగా రెండు లక్షల నష్టం వాటిల్లిందని అన్నారు. నాటు బాంబులు పెట్టి జీవాలు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు.

## టిప్పు విగ్రహ ప్రతిష్టని అడ్డుకుంటాం



**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త - వైద్యం :** ఎంతో మంది హిందువులను హత్య చేసిన టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని నగరంలో ప్రతిష్టించడానికి వీల్లేదని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు చిలకపాటి శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం నగరంలోని 19వ డివిజన్, శ్రీహరి నగర్‌లో ఉన్న బిజేపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ వందలాది మంది హిందువులను దీపావళి రోజున శిరచ్ఛేదన చేశాడని, బలవంతంగా హిందువులను ఇస్లాం మతం లోకి మార్చాడని ఆయన అన్నారు. ఆడవారిపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు చేశాడని, అటువం టి వ్యక్తిని ఈ రోజు కొంత మంది సమర్ధించడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. మీరు అబ్దుల్ కలాం విగ్రహం పట్టే పనైతే మేము కూడా మీకు సపోర్ట్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఘంటా మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఘంటా విజయ్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు మదన్, బూత్ అధ్యక్షుడు కిరణ్, బాలసుబ్రమణ్యం, చందు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు పొంగళ్ళు



**వరికుంటపాడు, జులై28, ప్రభాతవార్త :** మండలంలోని గణేశ్వరాపురం గ్రామంలో ఆదివారం భక్తులు గ్రామదేవత పోలేరమ్మతల్లికి ఘనంగా పొంగళ్ళు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున అత్యంత భక్తి శ్రద్దలతో పొంగళ్ళ సామాగ్రిని ఊరేగింపుగ మేళ తాళాలు, బాణాసంచ పేలుస్తుఅమ్మవారి ఆలయానకి తరలివెళ్ళారు. ఆలయం చుట్టూర ప్రదక్షణలుచేసి ఆలయం వద్ద పొంగళ్ళుపెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పిం చారు. కాయ కర్పూరంతోపాటు ఇతర వస్తువులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలుగుదేశంపార్టీ యువనాయకుడు పేరం సుధాకర్‌రెడ్డి ఆద్వర్యంలో ప్రజలు తరలివెళ్ళి ప్రత్యేకపూజలు చేశారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చింతాల రాజీనామా



**కావలి, జులై 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి ఆ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు ఆదివారం రాజీనామా చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడికి, రాష్ట్ర అధ్యక్షురాలుకు రాజీనామా లేఖలు పంపినట్లు తెలిపారు. దాదాపు 46 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ కార్యదర్శిగా, పిసిసి సభ్యుడుగా పనిచేసి ఆ పదవులకే వన్నెతెచ్చారు. 2014, 2019లలో కాంగ్రెస్ పార్టీ కావలి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేశారు. కావలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఇప్పటి వరకు కొనసాగారు. పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడ్డ న్యాయవాది చింతాల వెంకట్రావు ఆ పార్టీకి రాజీనామా చేయడంతో కావలి రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఏ పార్టీలో చేరే విషయం త్వరలో వెల్లడిస్తానని చింతాల తెలిపారు.

## ఘనంగా గండవరం 1994 - 95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**30 ఏళ్ల అనంతరం ఒక్కటైన పూర్వ విద్యార్థులు**

**అమెరికా, శ్రీలంక నుంచి విచ్చేసిన విద్యార్థులు**

**గురువులకు ఘనసత్కారం**

**పాఠశాలకు ఆల్ ఇన్ వన్ ప్రింటర్ వితరణ**







**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త :** చిన్ననాటి జ్ఞాపకాలు చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి చేష్టలు గురువులతో తిన్న బెత్తం దెబ్బలు ఇలా ఎన్నో మధురానుభూతులకు గండవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, అమెరికా, శ్రీలంక వంటి విదేశాల్లో సైతం స్థిరపడిన గండవరం పూర్వ విద్యార్థులందరూ 30 ఏళ్ల అనంతరం ఒకే వేదిక పై కలవడం వారి చిన్ననాటి సంగతలు ప్రస్తుత జీవిత విశేషాలను ఒకరికొకరు పంచుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గండవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994 - 95 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమకు విద్య నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. దేశ విదేశాల నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన విద్యార్థులు గురువులతో తమకున్న అనుబంధాన్ని, తాము చదువుకునే రోజుల్లో పాఠశాలలో పదిలంగా నిలిచిన జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. గురువులు కూడా 30 ఏళ్ల అనంతరం తమను గుర్తుపెట్టుకుని మరి ఈ వేదిక పైకి పిలిచి సత్కరించడం చాలా సంతోషంగా ఉందని, తమ జీవితాలకు సార్ధకత చేకూరిందని తమ మనసులోని భావాలను విద్యార్థులతో పంచుకున్నారు. గండవరం 1994 - 95 విద్యార్థులందరూ వివిధ వ్యాపారాల్లో ఉన్నతంగా జీవిస్తున్నారు. వీరంతా 30 ఏళ్ల అనంతరం తాము చదువుకున్న పాఠశాలలో కలిసి చిన్ననాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించి బహుమతులను అందజేసారు. పూర్వ విద్యార్థులందరూ గ్రూప్ ఫోటోలు దిగారు.

**పూర్వ విద్యార్థుల అభిప్రయాలు :** మనసుకు చాలా సంతోషంగా ఉంది షేక్ ఖలీల్, కొలంబో, శ్రీలంక పూర్వ విద్యార్థుల కలయిక కోసం నేను శ్రీలంక పూర్వ విద్యార్థుల కలయిక కోసం నేను శ్రీలంక నుంచి వచ్చాను. 30 ఏళ్ల అనంతరం అందరినీ కలవడం చాలా సంతోషంగా ఉంది. నేను కొలంబోలో ఒక కన్స్ట్రక్షన్ కంపెనీలో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాను. నేను ఉన్నతంగా స్థిరపడాడానికి ఆనాటి గురువులే కారణం. వారందరినీ, నాతోటి విద్యార్థులను ఇక్కడ కలవడం మనసుకు చాలా సంతోషంగా ఉంది.

**ఊహించలేదు :** కొండూరు తాతయ్య బెంగళూరు 30 ఏళ్ల అనంతరం అప్పుటి స్నేహితులను మళ్లీ కలుస్తానని అసలు ఊహించలేదు. నాకు సమాచారం ఇవ్వగానే వెంటనే వచ్చేసాను. మా మిత్రలందరూ బాగా స్థిరపడడం చూసి చాలా ఆనందంగా ఉంది. నేను చదివిన పాఠశాలకు 30 ఏళ్ల అనంతరం రావడం ఈ పూర్వ విద్యార్థుల కలయిక ఎప్పటికీ మర్చిపోలేనిది. మధుర జ్ఞాపకం. అనంతరం పూర్వ విద్యార్థుల ఆటపాటలు, కబుర్లతో కార్యక్రమం ఆహ్లాదకంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులు గున్నయ్య, రమణమూర్తి, చెంచురామయ్య, శాంతి కుమార్, రమణయ్య, ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘానికి రాష్ట్రంలోనే గుర్తింపు తెస్తా !

**ఆర్యవైశ్య సంఘానికి రాష్ట్రంలోనే గుర్తింపు తెస్తా !**

**కావలిలో ఆర్యవైశ్య భవనాన్ని నిర్మిస్తా !!**

**కావలి మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు తటవర్తి**



**కావలి, జులై 28 ప్రభాతవార్త :** కావలి మండలం ఆర్యవైశ్య సంఘానికి రాష్ట్రంలోనే ఒక గుర్తింపు తెస్తానని ఈ సంఘం నూతన అధ్యక్షులు, ప్రముఖ రియల్టర్ తటవర్తి రమేష్ తెలిపారు. కావలి పట్టణంలోని హోటల్ వి గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 18వ తేది కావలి మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వైశ్య పెద్దలు హాజరవుతున్నారన్నారు. పెద్దలందరిని ఆహ్వానించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కావలి మండల ఆర్యవైశ్య సంఘం చేపట్టలేని కార్యక్రమాలు చేసి చూపిస్తామన్నారు. కావలిలో ఆర్యవైశ్య సంఘం భవనాన్ని అన్ని వసతులతో నిర్మిస్తామన్నారు. ప్రమాణస్వీకారోత్సవ అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో వైశ్యులకు గుర్తింపు తెచ్చిన కావలి మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఎయంసి చైర్మన్ స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ సంఘం వైశ్యులందరికి అండగా వుంటుందన్నారు. వైశ్యుల్ని తాకాలంటే ప్రతి ఒక్కరు భయపడేలా ఈ సంఘం పాటుపడుతుందన్నారు. మృతి చెందిన వారి పార్థీవదేహాలు భద్రపరిచే రూముల్ని ఏర్పాటు చేసేందుకు దాత కనమర్లపూడి కోటేశ్వరరావును ఆశ్రయించడం జరిగిందన్నారు. ప్రస్తుత సమాజంలో బాడుగ ఇళ్లలో వుండేవారు చనిపోతే ఇళ్లలోకి రానీవ్వడం లేదన్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. దీనిని పరిగణలోకి పెట్టుకుని పార్థీవదేహాల్ని అంత్యక్రియలు చేసేంత వరకు భద్రపరిచేందుకు రూముల్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన వుందన్నారు. ఆర్యవైశ్యులకు ఒక భరోసా భద్రత కల్పిస్తానన్నారు. ఆర్యవైశ్య భవన నిర్మాణానికి తాను భూరి విరాళాన్ని అందజేసి మిగతా నిధుల కోసం దాతల దగ్గరకు రావడం జరుగుతుందన్నారు. వైశ్యులందరూ సంఘటితంగా వుండాలన్నారు. కావలి వైశ్యులకు ప్రత్యేక గుర్తింపు తెస్తానన్నారు. కావలిలో ఇప్పటి వరకు వైశ్యులు చెట్టుకొకరు పుట్టకొకరుగా వున్నారన్నారు. ఇటువంటి పరిస్థితులలో అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టానన్నారు. ప్రమాణస్వీకారోత్సవాన్ని విజయవంతం చేసి వైశ్యుల ప్రత్యేకతను చాటిచెప్పాలన్నారు. కమిటీ సభ్యులందరూ తమ సొంత కార్యక్రమంగా భావించి ప్రమాణస్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. గుప్తదానాలకు దాతగా పేరుగడించిన నూతన అధ్యక్షుడు తటవర్తి రమేష్ ప్రసంగం ఆద్యాంతం చప్పట్ల వర్షం మధ్య సాగింది. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తటవర్తి వాసు, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అనుమాలశెట్టి శివకుమార్, ప్రముఖ వస్త్ర వ్యాపార నేత గాదంశెట్టి మారుతి, ప్రముఖ న్యాయవాది పువ్వాడి ప్రసాద్, మంచికంటి మురళి, వేముల సునీల్, పోతుగంటి శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఒక ప్రణాళిక రూపొందించారు.

## శ్రీసాంబశివా చారిటబుల్‌ట్రస్ట్ సమీక్షా సమావేశం



**ఆత్మకూరు, జులై28, ప్రభాతవార్త :** ఈనెల 21న ఆత్మకూరులో అంగరంగ వైభవంగా హనుమాన్‌బైక్ శోభా యాత్ర జరిగిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా శ్రీసాంబశివా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్మకూరు లోని శ్రీత్రికోటేశ్వర కళ్యాణమండంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి శోభాయాత్రలో పనిచేసిన వారందరూ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నిత్య అన్నదాత కంచిపరమేశ్వర్‌రెడ్డి కి ఈ ఆలోచన రావడం దాన్ని ఆచరణలో పెట్టి అందరిని కలుపుకొని విజయవంతం చేసిన సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, కోడూరు హరినాథ్‌రెడ్డి, హరీష్‌ను పరమేశ్వర్‌రెడ్డి సన్మానిం చారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన భక్తులందరికి కాషాయ కండువాతో వారిని అభినందించారు. ఆత్మ కూరు ప్రాంతంలో రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా ఏ ఆధ్యాత్మిక కార్యక్రమాలైనా , సేవా కార్యక్రమాలున్నా తనను గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. అక్కడకు వచ్చిన పెద్దలు, భక్తులు ఇన్ని సేవా కార్యక్రమాలు చేస్తున్న పరమేశ్వర్‌రెడ్డిని చిరుసత్కారం అందుకోమని కోరగా ఆయన సున్నితంగా తిరస్కరించారు.

## ఘనంగా ఇండీవర్ జన్మదినోత్సవ వేడుకలు



**నెల్లూరు, జులై28 ప్రభాతవార్త-విద్య :** హాల్‌మార్క్, సరయు హీరోషోరూంల అధినేత అప్పల రాజ్‌కుమార్ తనయుడు అప్పల ఇండీవర్ జన్మదినోత్సవ వేడుకలను ఆదివారం నగరంలో స్థానిక క్యాప్‌హోమ్‌లో విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీకేక్‌కు కట్‌చేశారు. అనంతరం క్యాప్‌లోని చిన్నారులకు వారి కుటుంబ సబ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర వ్వహించారు. ఈసందర్భంగా సరయు రాజ్‌కుమార్ మాట్లాడుతు తన తనయుడు ఇండీవర్ జన్మదినోత్సవం సందర ్భంగా శుభాకాంక్షలు తెలిపిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే తమ అప్పల సుశీలమ్మ ఫౌండేషన్ తరపున అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని, భవిష్యత్‌లో మరిన్ని కార య్రక్రమాలు చేపట్టనున్నామన్నారు. తన తనయుని జన్మదినోత్సవాన్ని చిన్నారుల మధ్య జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సరయు రాజ్‌కుమార్ దంపతులు, హాల్‌మార్క్ సిబ్బంది, సరయు షోరూం సిబ్బంది తదితరులు

## గొలగమూడిలో పారిశుద్ధ్య నిర్మూలనా చర్యలు



**వెంకటాచలం, జూలై28ప్రభాతవార్త** మండలంలోని గొలగమూడి గ్రామంలో గత ఆరు రోజుల క్రింతం ఒక యువకుడు విష జ్వరం భారినపడ్డాడు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన శివ అనే యువకుడు విష జ్వరం భారిన పడి నాలుగురోజుల పాటు నెల్లూరులోనిఒక ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పోంది కోలుకున్నాడు. విషయాన్ని స్థానికులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే స్పందించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులతోమాట్లాడినారు. దీంతో గత రెండు రోజులుగా గ్రామంలో పంచాయితీ అధికారులతో కలసి వైద్యఆరోగ్యశాఖా సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి పారిశుధ్య నిర్మూలనా చర్చలు చేపట్టారు. ఆదివారం కాలువలో వున్న వ్యర్థాలను తోలగించారు. అవసరం వున్న చోట బ్లీచింగ్ చల్లించారు. ప్రతి ఇంటికి వెళ్ళి పారిశుధ్యంపై అవగాహన కల్పించనున్నట్లు పంచాయితీకార్యదర్శి బాబు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పార్ధసారధి నాయుడు, దామోదర్, మనోహర్ తదితరులున్నారు.

## యువకుడికి కత్తిపోట్లు



**మనుబోలు, జులై 28, ప్రభాతవార్త** మండల కేంద్ర మైన మనుబోలు పడమటి వీధిలో ఆదివారం మొల కల శషిధర్‌రెడ్డి అనే యువకుడిపై నలుగురు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో శశిధర్‌రెడ్డికి తీవ్ర గాయాలు అయితే గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుడూరు రూరల్ మండలం వెందోడు గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి అనే యువకుడు తన స్నేహితులతో కలిసి శశిధర్‌రెడ్డి ఇంట్లో కత్తితో దాడి చేసినట్లు ఈ దాడిలో మెడకు, పొట్టకు గాయాలు అయ్యాయని గాయపడ్డ శశిధర్‌రెడ్డిని గూడూ రు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ హఠాత్‌పరిణామంకు శశిధర్‌రెడ్డి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనలో మునిగిపోయారు. డబ్బులు, ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవ జరిగి కత్తులతో దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో మనుబోలు గ్రామం ఉలిక్కిపడింది. మనుబోలు పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## నేడు సప్తాహ్ ముగింపు కార్యక్రమాలు

**కోవూరు జులై 28 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాశాఖ అధికారి-2 వై. చెంచులక్ష్మమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుభదిన్ భోజన్ తిథి భోజనం ద్వారా రిజిస్టర్ కాబడిన దాతల సహకారంతో అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. అన్ని పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.